
సాక్షి ఒడిశా
శుక్రవారం । 16 । ఫిబ్రవరి । 2024


శ్రీమందిరం ఆదాయం లెక్కింపు
భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,68,248లు, బంగారం 200 మిల్లీగ్రాములు, వెండి 16గ్రాములు 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.


నేటి నుంచి ప్లస్ టూ వార్షిక పరీక్షలు
రాష్ట్రంలో ఉన్నత మాధ్యమిక విద్యా మండలి (సీహెచ్ఎస్ఈ) ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ప్లస్ టూ వార్షిక పరీక్షలు ప్రారంభమవ్వనున్నాయి.
- 8లో


వేద మండపం నిర్మాణానికి భూమిపూజ
పట్టణంలో వేద మండపం నిర్మాణానికి కొరాపుట్ బ్రాహ్మణ సమాజ్ గురువారం భూమిపూజ నిర్వహించింది.
- 8లో

న్యూస్‌రీల్

ఈనెల 29న రాష్ట్రపతి పర్యటన

భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్ర పర్యటనకు విచ్చేయనున్నారు. ఈనెల 29న మయూరభంజ్ జిల్లాకు విచ్చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మయూర్‌భంజ్ జిల్లా ఖిచింగ్‌లో మా కిచ్‌కేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ నుంచి రాష్ట్రపతి పర్యటన గురించి ఖిచింగ్ ఆలయ కార్యాలయానికి సమాచారం అందింది. ఈనెల 29న ఉదయం 10 గంటల నుంచి 10.40 గంటల వరకు అమ్మవారి ఆలయంలో హారతి, దర్శనం కార్యక్రమాల్లో రాష్ట్రపతి ప్రత్యక్షంగా పాల్గొంటారు.

బంగారు ఆభరణాల దోపిడీ


బాధితుడు మణి భూషణరావు

రాయగడ: ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతమైన జిమిడిపేట సమీపంలో దంపతులను అడ్డగించి వారి నుంచి బంగారు ఆభరణాలు దోపిడీ చేసిన ఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ మేరకు బాధితుడు శిఖాల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ మన్యం జిల్లాలోని కొమరాడ ప్రాంతానికి చెందిన మణి భూషణ రావు అతని భార్యతో కలిసి పనిమీద రాయగడ బైకుపై వచ్చారు. పనులు ముగించుకున్న అనంతరం తిరిగి బధవారం సాయంత్రం తమ స్వగ్రామం కొమరాడ వెళ్తున్న సమయంలో ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతమైన జిమిడిపేట సమీపంలో ఇద్దరు వ్యక్తులు బైకుపై వచ్చి వారిని అడ్డగించారు. భార్యాభర్తలను కత్తితో భయపెట్టి మణిభూషణరావు భార్య మెడలోని మంగళసూత్రం, ఇతర బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. దుండగులు బైకుపై హెల్మెట్లు ధరించి వచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

రాయగడ: స్థానిక అటానమస్ కళాశాలలో గురువారం రక్తదాన శిబిరం జరిగింది. నువా ఒడిశా–అమో ఒడిశా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ శిబిరంలో 28 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. విద్యార్థులు సేవా దృక్పథం అలవర్చుకొని ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు ముందుకు వెళ్లాలని, అందుకే ఇటువంటి తరహా చైతన్య, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ బాబిలత షరప్ తెలియజేశారు. జిల్లా కేంద్రా స్పత్రి ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వి.లోక్‌నాథ్ రాజు, డాక్టర్ కె.నవీన్‌ల పర్యవేక్షణలో శిబిరం నిర్వహించారు.

చిరుత పులుల చర్మాలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న చిరుత పులి చర్మాలు

భువనేశ్వర్: సంబల్‌పూర్ జిల్లా కుచిందా పోలీసుస్టేషన్ పరిధి రియానాళి సమీపంలోని కుచిండా – బొణైగడ్ రహదారి ప్రాంతంలో గురువారం తెల్లవారు జామున స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) బృందం దాడి చేసి రెండు చిరుత పులుల చర్మాలను స్వాధీనం చేసుకుంది. ఈ వ్యవహారంలో ఇద్దరు నిందితులను అరెస్టు చేసింది. వీరిని దేవ్‌గడ్ జిల్లా పహడొమొరొ గ్రామానికి చెందిన సంకీతన్ ముండా, ధనేశ్వర్ ముండాలుగా గుర్తించారు. బమరా అటవీ మండలం అటవీశాఖ అధికారుల సహకారంతో దాడులు నిర్వహించారు. సన్నిహిత వర్గాల సమాచారం ఆధారంగా అటవీ అధికారుల సాయంతో ఎస్‌టీఎఫ్ వన్యప్రాణుల చర్మాలు కలిగి ఉన్న నిందితులను అదుపులోకి తీసుకోగలిగింది. నిందితులు ఈ చర్మానికి సంబంధించిన ఆమోదయోగ్య వివరాలు దాఖలు చేయనందున వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 కింద కేసు నమోదు చేసి కోర్టుకు పంపనున్నారు. స్వాధీన పరచుకున్న చిరుత పులి చర్మాలను జీవ సంబంధ పరీక్షల కోసం డెహ్రాడూన్ తరలించేందుకు నిర్ణయించారు.

ధర్మేంద్ర ప్రధాన్ దారెటు..?

- ముగియనున్న రాజ్యసభ పదవీ కాలం
- ఈసారి మధ్యప్రదేశ్ నుంచి దక్కని ప్రాతినిధ్యం
- ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీచేసే అవకాశం


ధర్మేంద్ర ప్రధాన్

భువనేశ్వర్: త్వరలో జరగనున్న రాజ్యసభ ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలకు వేదికయ్యాయి. కటక్ బరాబటి నియోజకవర్గం సిటింగ్ ఎమ్మెల్యే దేబాశిష్ సామంత్రాయ్ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రత్యక్షంగా పోటీ చేసేందుకు వీలు లేకుండా పార్లమెంట్ ఎగువ సభకు ప్రతిపాదించబడ్డారు. అలాగే మరోసారి అధికార బీజేడీ మద్దతుతో బీజేపీ అభ్యర్థిగా కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ బరిలో నిలిచారు. మరోవైపు రాజ్యసభ నుంచి కేంద్రంలో పలు కీలక శాఖల్లో మంత్రిగా వెలుగొందిన ప్రస్తుత విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈసారి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మధ్యప్రదేశ్ భారతీయ జనతా పార్టీ రాజ్యసభ జాబితా రాష్ట్ర రాజకీయ వాతావరణాన్ని చముక్కుమనిపించింది. ఈ జాబితాలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేరు లేకపోవడం విశేషం. ఇప్పటివరకు ఆయన మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. రాష్ట్ర భారతీయ జనతా పార్టీ సభ్యునిగా చలామణి అవుతూ మధ్యప్రదేశ్ నుంచి ఎగువ సభకు ప్రాతినిధ్యం వహించారు. 2018 సంవత్సరంలో మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన ఆయన పదవీకాలం ఈ ఏడాది ఏప్రిల్ 2తో ముగుస్తుంది. మరోసారి రాజ్యసభకు ఆయన వెళ్లడం లేదని మధ్యప్రదేశ్ తాజా జాబితా స్పష్టం చేయడంతో ఈ ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ధర్మేంద్ర ప్రధాన్ ప్రత్యక్షంగా పోటీ చేయడం తథ్యమని తేలిపోయింది.

లోక్‌సభకు పోటీ..?

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ధర్మేంద్ర ప్రధాన్ లోక్‌సభ నుంచి పోటీ చేస్తారని ఇటీవల ప్రచారమైన ఊహాగానాలు వాస్తవమని ఖరారు అయింది. బుధవారం భారతీయ జనతా పార్టీ మధ్యప్రదేశ్ నుంచి 4 మంది రాజ్యసభ అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. కేంద్ర మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ మినహా ఇతర స్థానాల్లో కొత్త ముఖాలను ప్రకటించింది. మధ్యప్రదేశ్ రాజ్యసభ భారతీయ జనతా పార్టీ అభ్యర్థుల జాబితా రాష్ట్ర సార్వత్రిక ఎన్నికల వాతావరణాన్ని మరింత వేడెక్కించింది. ధర్మేంద్ర ప్రధాన్ ప్రత్యక్ష పోరులో బిజూ జనతా దళ్‌కు చెందిన ఏ అభ్యర్థితో ఏ స్థానం నుంచి తలపడతారోననే ఉత్కంఠ నెలకొంది. ఇంతవరకు ఉన్న స్థితిగతుల దృష్ట్యా ఆయన పశ్చిమ ఒడిశా సంబల్‌పూర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసే అవకాశం ఉంది. ధర్మేంద్ర ప్రధాన్ అభ్యర్థిత్వంతో రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ సరికొత్త మైలు రాయిని ఆవిష్కరించాలనే యోచనతో వ్యూహాత్మకంగా బరిలోకి దింపుతోంది. ధర్మేంద్ర ప్రధాన్ పలు ఎన్నికల్లో రాష్ట్రేతర ప్రాంతాల్లో ఎన్నికల పర్యవేక్షకునిగా పార్టీకి ఘన విజయం చేకూర్చారు. సొంత రాష్ట్రంలో ప్రత్యక్ష పోరులో ఆయన పట్టు రుజువు చేసుకోవలసిన సమయం ఆసన్నమైంది. రాష్ట్రంలో వివాదస్పదమైన లేదా బలహీన ప్రాతినిధ్య ప్రాంతం నుంచి ధర్మేంద్ర ప్రధాన్‌ని నిలబెట్టి అధికార పక్షం బిజూ జనతా దళ్‌పై విజయం సాధించే రాజకీయ వ్యూహ చిత్రం తుది మెరుగులు దిద్దుకుంటుందని అంతరంగిక వర్గాల సమాచారం.

శ్రీమందిరంపై నో ఫ్లయింగ్ జోన్



భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథ ఆలయం రక్షణపై స్థానిక పోలీసు యంత్రాంగం అప్రమత్తమవుతోంది. ఆలయం పైభాగం నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించారు. లోగడ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినా చర్యలు లేకపోవడంతో పలు విమర్శలకు గురయ్యారు. ప్రధానంగా ఇటీవల శ్రీమందిరం శిఖరం నుంచి ఆలయ సమగ్ర దృశ్య చిత్రీకరణ డ్రోన్ కెమెరాతో రికార్డు అయ్యి సాంఘిక మాధ్యమంలో హల్‌చల్ చేసింది. ఈ నేపథ్యంలో నో ఫ్లయింగ్ జోన్‌పై సాధారణ ప్రజానీకంలో అవగాహన పెంపొందించాలని పూరీ జిల్లా పోలీసు యంత్రాంగం నిర్ణయించింది. జగన్నాథ దేవాలయంపై ఎటువంటి చిత్రీకరణ ఆమోదయోగ్యం కాదు. ఈ నిబంధన ఉల్లంఘన కఠిన చర్యలకు తప్పవని పోలీసు యంత్రాంగం హెచ్చరించింది. ఈ మేరకు సోషల్ మీడియా వేదికలపై నో ఫ్లయింగ్ జోన్ అంక్షలను ప్రసారం చేసింది. శ్రీజగన్నాథ దేవాలయం పరిసరాల్లో ప్రశాంతత, భద్రతకు భరోసా కల్పించి పుణ్యక్షేత్రం పవిత్రతను కాపాడేందుకు నో ఫ్లయింగ్ జోన్ ప్రకటించినట్లు వివరించారు. దీంతో శ్రీ మందిరం లోపల, వెలుపల భద్రత, రక్షణకు ఎలాంటి భంగం కలగకుండా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇటీవల డ్రోన్ కెమెరాలో చిత్రీకరించిన జగన్నాథ ఆలయ విహంగ వీక్షణ సోషల్ మీడియాలో విస్తారంగా ప్రసారం అయింది. ఈ వ్యవహారంలో నిందితుల వ్యతిరేకంగా చట్టపరమైన చర్యల కోసం స్థానిక శ్రీ మందిరం సింహద్వారం ఠాణాలో ఫిర్యాదు నమోదు చేసినట్లు ప్రకటించారు. లోగడ పలు అభ్యంతరకర వీడియో, ఫొటో చిత్రీకరణ చర్యలు వివాదస్పదం అయ్యాయి.

ఘాట్ రోడ్డులో బస్సు బోల్తా

- 40 మంది ప్రయాణికులకు గాయాలు
- ముగ్గురు పరిస్థితి ఆందోళనకరం


బోల్తాపడిన బస్సు


టెక్కబడి లోయలో పల్టీకొట్టిన ట్రక్కు

బరంపురం: కొందమాల్ జిల్లా పుల్బణి పట్టణం నుంచి బరంపురం వస్తున్న ప్రయాణికుల బస్సు బుధవారం సాయంత్రం తప్తపాణి ఘాట్ రోడ్డులో అదుపుతప్పి చెట్టును ఢీకొని బోల్తాపడింది. ఈ దుర్ఘటనలో సుమారు 40 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న గంజాం ఎస్పీ జగ్‌మోహన్ మీన సంఘటన స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది, ఒడ్రాఫ్ బృందం సాయంతో బస్సులో చిక్కుకున్న క్షతగాత్రులను బయటకు తీశారు. గాయపడిన వారిని దిగపండి ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రికి తరలించి వైద్యుల సాయంతో చికిత్స అందించారు. ముగ్గురు పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో బరంపురం ఎంకేసీజీ మెడికల్ కళాశాలకు తరలించారు.

సిమెంట్ ట్రక్కు పల్టీ

అదేవిధంగా కొందమాల్ జిల్లా పుల్బణి పట్టణం నుంచి బమ్మిణిగాం బ్లాక్ వెళ్తున్న సిమెంట్ ట్రక్కు టెక్కబడి లోయలో పల్టీ కొట్టింది. ఈ ఘటనలో స్వల్ప గాయాలతో డ్రైవర్ బయటపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది, ఒడ్రాఫ్ బృందం సాయంతో లోయలో పడిన సిమెంట్ ట్రక్కుని బయటకు తీసి డ్రైవర్‌ని రక్షించారు.

రేషన్ బ్యాగులు కాల్చివేసిన బీజేపీ కార్యకర్తలు


బ్యాగులు కాల్చివేస్తున్న దృశ్యం


మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి కార్యాలయం వద్ద జిల్లా బీజేపీ కార్యకర్తలు అమో ఒడిశా – నవీన్ ఒడిశా తరుపున రేషన్ కార్డుదారులకు పంపిణీ చేస్తున్న బ్యాగులను కాల్చివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గిరిజనుల కోసం అనేక పథకాలు ప్రవేశపెడుతుంటే, రాష్ట్ర ప్రభుత్వమే మొత్తం చేసినట్లు ప్రచారం చేసుకుంటోందని మండిపడ్డారు. బ్యాగ్‌లపై బీజేడీ గుర్తుతో పాటు 5టీ గుర్తు వేసి పంపిణీ చేయడం సరికాదన్నారు.

జూలై నాటికి 4జీ సేవలు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలోని బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు జూలై నాటికి 4జీ సేవలు అందుబాటులోకి వస్తాయని బరంపురం టెలికాం అడ్వైజరీ కమిటీ ప్యానల్ సభ్యుడు ఛిత్రి సింహాద్రి తెలియజేశారు. బరంపురంలో గురువారం జరిగిన టీఏసీ కమిటీ సాధారణ సమావేశానికి గజపతి జిల్లా నుంచి బబునా బెహేరా, ఛిత్రి సింహాద్రిలు హాజరయ్యారు. అనంతరం బరంపురం టెలికాం జనరల్ మ్యానేజర్ బాలేర్ సింగ్‌ను వారు కలిసి నెట్‌వర్క్ సమస్యలపై మాట్లాడారు.

బయో డైవర్సిటీ ప్రాంతంగా గుప్తేశ్వర్ అడవి



దట్టమైన వృక్షాల మధ్య గుప్తేశ్వర్ గృహానికి మార్గం


గుప్తేశ్వర్ అడవిలోని శివక్షేత్రం

జయపురం: సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితిలోని సుప్రసిద్ధ శివక్షేత్రం గుప్తేశ్వర్ అటవీ ప్రాంతాన్ని బయో డైవర్సిటీ హెరిటేజ్ ప్రాంతంగా సీఎం నవీన్ పట్నాయక్ ప్రకటించారు. ఆ మేరకు ముఖ్యమంత్రి నవీన పట్నాయక్ కార్యాలయం నుంచి ఒక పత్రిక ప్రకటన గురువారం విడుదలైంది. దీంతో రాష్ట్రంలో ఇది నాలుగో బయో డైవర్సిటీ ప్రాంతంగా గుర్తింపు పొందింది. దీనిలో భాగంగా వృక్ష సముదాయం, జంతువులు, అభయారణ్యంలో కనుమరుగవుతున్న జాతులు పరిరక్షించబడతాయి. అందువలన ఈ ప్రాంత ప్రజలు లబ్ధి పొందుతారని ప్రభుత్వం భావిస్తోంది.

608 ప్రాణులు గుర్తింపు

గుప్తేశ్వర్ అటవీ ప్రాంతంలో 608 రకాల వన్య ప్రాణులు, 182 రకాల విలువైన పూల మొక్కలు, 177 రకాల ప్రజాప్రయోగ మూలికలు, 669 రకాల తీగలు గుర్తించడం జరిగిందని జయపురం డీఎఫ్‌వో ప్రతాప్ కుమార్ బెహర వెల్లడించారు. ఈ మేరకు ఈ ప్రాంతానికి బయో డైవర్సిటీ చట్టం – 2002 గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. ఇదివరకు కందమాల జిల్లా మండసార, గజపతి జిల్లాలో మహేంద్రగిరి పర్వత ప్రాంతం, బొరగడ జిల్లాలో గంధమర్ధన ప్రాంతాలు బయో డైవర్సిటీ ప్రాంతాలుగా ఉన్నాయి. 2018 నుంచి గుప్తేశ్వర అటవీ ప్రాంతాన్ని బయో డైవర్సిటీ ప్రాంతంగా ముఖ్యంగా హల్దికుండ్ గ్రామ పంచాయతీ ప్రాంతాన్ని బయో డైవర్సిటీ హెరిటేజ్ ప్రాంతంగా ప్రకటించాలని జయపురం ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ కేంద్రం డిమాండ్ చేస్తోంది. ఈ మేరకు 2023 ఆగస్టులో గుప్తేశ్వర్ బయోడైవర్సిటీ మేనేజ్‌మెంట్ కమిటీ రాష్ట్ర బయో డైవర్సిటీ బోర్డుకు వినతిపత్రం సమర్పించింది. ఎట్టకేలకు బయో డైవర్సిటీ హెరిటేజ్ ప్రాంతంగా ప్రకటించటంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


గుప్తేశ్వర్ ప్రాంతంలో శబరీ నది


గుప్తేశ్వరలో గృహల సముదాయం

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జయపురం: స్థానిక పవర్ హౌస్ కాలనీలోని బణిత యాక్టవిటీ పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ కూడలి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పట్టణ పోలీసు అధికారి రంజన్ దొళాయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియమాలు పాటించాల్సిన విధానాలపై విపులీకరించారు. పాఠశాలలకు వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు నియమాలు పాటించకపోతే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంటుందని, అందువలన క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వణిత మహాపాత్రో, పాఠశాల డైరెక్టర్ సుభాషిస్ పాణిగ్రాహి, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భారీగా గంజాయి సీజ్


నిందితుడితో పాటు స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపిస్తున్న పోలీసులు


బొలేరోతో అరెస్టు చేసిన వ్యక్తి

బరంపురం: గంజాం జిల్లాలోని 16వ నంబర్ జాతీయ రహదారిపై అక్రమంగా బరంపురం వైపు గంజాయిని తరలిస్తున్న కారుపై బరంపురం ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి 150 కిలోల గంజాయి సీజ్ చేశారు. పోలీసులకు అందిన ముందస్తు సమాచారం మేరకు ధనుంజయ్‌పూర్ దగ్గర జైయ్‌పూర్ వద్ద రెక్కి నిర్వహించారు. దీనిలో భాగంగా పెట్రోల్ బంకు దగ్గర కారుపై దాడులు చేసి 11 బస్తాల్లో 150 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్టు చేశారు. అలాగే కారును సీజ్ చేశారు. అదేవిధంగా గజపతి జిల్లా మోహనా అటవీ ప్రాంతం నుంచి బరంపురం నగరానికి బొలేరోలో అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు ముందస్తు సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు మార్గం మధ్యలో వాహన తనికీలు నిర్వహించారు. అనుమానంతో ఒక బొలేరోలో సోదాలు చేయగా 25 కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో వాహనం సీజ్‌చేసి డ్రైవర్‌ను అరెస్టు చేశారు.

రాజ్యసభకు అశ్విని వైష్ణవ్ నామినేషన్

- బీజేడీ మద్దతుతో ఎన్నిక లాంఛనమే


నామినేషన్ దాఖలు చేస్తున్న అశ్విని వైష్ణవ్

భువనేశ్వర్: ఒడిశా రాజ్యసభ ఎన్నికలకు భారతీయ జనతా పార్టీ అభ్యర్థి అశ్విని వైష్ణవ్ గురువారం నామినేషన్ దస్తావేజులు దాఖలు చేశారు. కేంద్ర రైల్వే, కమ్యూనికేషన్స్, ఎలక్ట్రానిక్స్ మరియు సాంకేతిక సమాచార శాఖ మంత్రిగా ఉన్న అశ్విని వైష్ణవ్ రాష్ట్ర శాసన సభ రిటర్నింగ్ అధికారికి 2 సెట్ల నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈనెల 27న పార్లమెంట్ ఎగువ సభకు జరగనున్న ఎన్నికలకు నామినేషన్ దాఖలు చివరి రోజున రైల్వేమంత్రి నామినేషన్ దాఖలు చేశారు. ఆయన లోగడ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయికి ప్రైవేట్ సెక్రటరీగా పని చేశారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్, నారీ నాయక్, కుసుమ్ టెటే, మోహన్ చరణ్ మాఝీ తదితరులు పాల్గొన్నారు.

గెలుపు తథ్యం

2019 సంవత్సరంలో జరిగిన రాజ్యసభ ఎన్నికల తరహాలో ఈసారి కూడా మాజీ ఐఏఎస్ అధికారి అశ్విని వైష్ణవ్ సునాయాసంగా గట్టెక్కుతారు. గతంలో మాదిరిగా ఆయన గెలిపొందేందుకు రాష్ట్ర అధికార పక్షం బిజూ జనతా దళ్ స్వచ్ఛందంగా మద్దతు ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. రాష్ట్రం నుంచి రాజ్యసభకు 3వ అభ్యర్థిపై ఉత్కంఠకు తెర దించుతూ అశ్విని వైష్ణవ్ పేరును భారతీయ జనతా పార్టీ ప్రకటించిన కొద్దిసేపటికే బిజూ జనతా దళ్ తన మద్దతు ప్రకటించింది. అయితే అశ్విని వైష్ణవ్ అసెంబ్లీ భవనంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించే సమయంలో ప్రాంతీయ పార్టీ బిజూ జనతా దళ్‌కు చెందిన సభ్యులు ఎవరూ హాజరు కాలేదు. రాష్ట్రం నుంచి తొలిరెండు రాజ్యసభ స్థానాలకు బీజేడీకి చెందిన దేబాశిష్ సామంత్రాయ్, సుభాశిష్ కుంఠియా నామినేషన్ పత్రాలను దాఖలు చేసిన విషయం తెలిసిందే.

బీజేడీకి 3 స్థానాలు గెలిచే బలం

రాష్ట్రం నుంచి ఖాళీ అయిన 3 రాజ్యసభ స్థానాలను గెలుచుకోవడానికి అధికార బీజేడీకి పుష్కలమైన బలం ఉంది. 3వ స్థానం కోసం పోటీ చేస్తున్న భారతీయ జనతా పార్టీకి మాత్రం బలం అంతంత మాత్రమే. ఆ పార్టీకి రాష్ట్ర శాసన సభలో కేవలం 22 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు. రాజ్యసభకు ఎన్నిక అయ్యేందుకు ఈ బలం ఎంత మాత్రం చాలదు. ఈ పరిస్థితి నుంచి బీజేపీని గట్టెక్కించేందుకు బీజేడీ స్వచ్ఛందంగా ముందుకు రావడం విశేషం. రాష్ట్రానికి చెందిన ముగ్గురు రాజ్యసభ సభ్యుల పదవీకాలం ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ముగియనుంది. ఈ జాబితాలో బీజేపీ అభ్యర్థి అశ్విని వైష్ణవ్ మరియు బీజేడీ ప్రతినిధులు ప్రశాంత్ నందా, అమర్ పట్నాయక్ ఉన్నారు.

క్లుప్తంగా

తూనికలు కొలతల శాఖ ఆకస్మిక తనిఖీ



డిక్లరేషన్ లేని గ్యాస్ సిలెండర్‌లు తనిఖీలో విజయనగరం లీగల్ మెట్రాలజీ ఉప నియంత్రకులు మధుసూదనరెడ్డి

కాశీబుగ్గ: తూనికలు, కొలతల శాఖ ఆధ్వర్యంలో పలాస, టెక్కలి డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజయనగరం లీగల్ మెట్రాలజీ ఉప నియంత్రకులు విజయనగరం బి.మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పలాస, కంచిలి, కోటబొమ్మాళి పట్టణాల్లో మూడు బృందాలుగా తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 22 సంస్థలపై కేసులు నమోదు చేశారు. మధుసూదనరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనలను బట్టి నడుచుకోవాలని అన్నారు. తనిఖీలో పలాస ఇన్‌స్పెక్టర్ రాజా రమేష్, ఎస్ఎం రాధాకృష్ణ, ఎంవీ రమణమూర్తి, పీవీడీ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో నియామకాలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్ సీపీలో పలు విభాగాలకు చెందిన రాష్ట్ర కమిటీల్లో జిల్లాకు చెందిన పలువురికి స్థానం కల్పిస్తూ రాష్ట్ర కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు ఎస్టీ సెల్ కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా బందపల్లి రాకేష్, రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శులుగా పిట్ట దామోదరరావు, కార్యదర్శిగా టంకాల బాలకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా ఆరంగి లక్ష్మీపతి, పొన్నాడ వెంకటరమణలను నియమించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దుర్గారావు

నరసన్నపేట: తామరాపల్లి శివార్లలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నందిగాం మండలం శివరాంపురానికి చెందిన నక్క దుర్గారావు(34) మృతి చెందాడు. డివైడర్ దాటి నరసన్నపేట నుంచి టెక్కలి వైపు వెళ్లే రోడ్డు మీదకు నడుచుకుని వస్తున్నప్పుడు గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే ఊపిరి వదిలేశారు. సమాచారం తెలుసుకున్న ఏఎస్ఐ అశిరినాయుడు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామని అన్నారు.

'కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు'



విద్యార్థులతో ముచ్చటిస్తున్న కృష్ణదాస్

జలుమూరు: మీరు కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యం దిశగా వెళ్లి ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నాడు-నేడు పథకంలో భాగంగా రూ. 50 లక్షలతో చల్లవానిపేట ఉన్నత పాఠశాల భవనాలు నిర్మించారు. గురువారం వాటిని ప్రారంభించి విద్యార్థులతో మాట్లాడా రు. మీకు ఇన్ని సదుపాయాలు కల్పిస్తున్నది రాజకీయాల కోసం కాదని అన్నారు. మీకు ఉజ్వల భవిష్యత్ ఇచ్చేందుకు ముఖ్యమంత్రి కృత నిశ్చయంతో ఉన్నారని తెలిపారు. బాగా చదువుకుని అందరికీ మంచి పేరు తీసుకురావాలన్నారు.

భక్తిశ్రద్ధలతో చక్రతీర్థ స్నానాలు



వంశధార కాలువలో చక్రతీర్థ స్నానాలు చేస్తున్న భక్తులు

సారవకోట: మండలంలోని కిన్నెరవాడ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చక్రతీర్థ స్నానాలు గురువారం భక్తిశ్రద్ధలతో వంశధార ఎడమ కాలువలో నిర్వహించారు. ఈ ఆలయంలో గత మూడు రోజుల నుంచి జరుగుతున్న కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు ఈ చక్రతీర్థ స్నానాలు నిర్వహించినట్లు అర్చకులు కొరపాక సిద్ధయ్య స్వామి తెలిపారు.

జాబ్ మేళాలో 171 మంది ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఆంధ్ర ప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం మెగాజాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు 14 ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు హాజరు కాగా, పదో తరగతి నుండి పీజీ వరకు విద్యార్హత కలిగిన 509 మంది హాజరయ్యారు. కంపెనీల నిబంధనల మేరకు రాత పరీక్ష, ఇంటర్యూవ్యలు నిర్వహించారు. ప్రతిభ ఆధారంగా 171 మంది ఎంపికయ్యారు. వీరికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జిల్లా స్కిల్ డెవలెప్‌మెంట్ అధికారి పీబీ సాయి జాబ్ మేళా ప్రారంభించారు.

నేటి నుంచి ప్లస్ టూ వార్షిక పరీక్షలు



భువనేశ్వర్: రాష్ట్రంలో ఉన్నత మాధ్యమిక విద్యా మండలి (సీహెచ్‌ఎస్‌ఈ) ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ప్లస్ టూ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో మండలి పరీక్షలు రాయబోతున్న అభ్యర్థులకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసింది. విద్యార్థులకు కేవలం బ్లాక్ బాల్ పాయింట్ పెన్నులు, అడ్మిట్ కార్డులను మాత్రమే పరీక్ష హాల్ లోపలకు అనుమతిస్తారని ప్రత్యేకంగా గుర్తు చేసింది.

విద్యార్థులకు మార్గదర్శకాలు

- పరీక్ష ప్రారంభానికి అరగంట ముందుగా కేంద్రానికి చేరుకోవాలి.
- బ్లాక్ బాల్ పాయింట్ పెన్నులు, అడ్మిట్ కార్డులు మినహా ఇతర వస్తువులను పరీక్ష హాలులోకి అనుమతించరు.
- పావు గంట (15 నిమిషాలు) ముందుగా హాలులోకి ప్రవేశించాలి. 10 నిమిషాల ముందుగానే జవాబు కాపీ పంపిణీ చేస్తారు.
- పరీక్ష సమయానికి 5 నిమిషాల ముందుగానే ప్రశ్నపత్రం ఇస్తారు.
- జవాబు పత్రం క్రమసంఖ్య, పేజీ సంఖ్యను బాగా తనిఖీ చేసుకుని పొరపాటు జరిగితే వెంటనే తెలియజేయాల్సి ఉంటుంది.
- ప్రశ్నపత్రంలో పేజీ నంబర్ లేదా ప్రింటింగ్ లోపం ఉంటే వెంటనే తెలియజేయాలి.
- అదనపు జవాబు పత్రాలు ఇవ్వరు.
- విద్యార్థులు ప్రశ్నపత్రంపై రోల్ నంబర్ మినహా ఏదైనా మార్కు వేసినా లేదా ఏదైనా రాసినా పరీక్షలు రాయకుండా నిషేధించబడతారు.
- జవాబు పత్రంలో నిర్దేశిత స్థలంలో రోల్ నంబర్, రిజిస్ట్రేషన్ నంబర్ రాయడం తప్పనిసరి.
- ప్రశ్నపత్రం సెట్ కోడ్‌ను ఖచ్చితంగా రాయాలి.
- హాజరు షీట్‌లో రోల్ నంబర్‌ను తనిఖీ చేసి హాజరు నమోదు చేయాలి.

నిఘా నీడలో పరీక్షలు

పరీక్ష ప్రాంగణం సమగ్రంగా సీసీటీవీ నిఘాలో ఉంటుంది. నిత్యం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఒకే షిఫ్టులో పరీక్షలు జరుగుతాయి. పరీక్షలు మార్చి 20వ తేదీతో ముగుస్తాయి. ఫలితాలు మే మొదటి వారంలో ప్రకటించే అవకాశం ఉంది. ఆర్ట్సు, సైన్స్, కామర్స్, వృత్తి విద్యా వివిధ విభాగాల్లో సమగ్రంగా 3,84,597 మంది విద్యార్థులు ఈసారి పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో 3,59,039 మంది రెగ్యులర్, 25,558 మంది ఎక్స్-రెగ్యులర్ అభ్యర్థులు ఉన్నారు. ఇది గత సంవత్సరం కంటే 26,655 మంది విద్యార్థుల పెరుగుదలను సూచిస్తుంది. ఆర్ట్సులో 2,21,00 మంది, సైన్స్‌లో 1.08 లక్షలు మంది, కామర్స్‌లో 24,157 మంది, వృత్తి విద్యా విభాగంలో 4,978 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. సైన్స్ విభాగం పరీక్షలు ఈనెల 16న ఒడియా సబ్జెక్టుతో ప్రారంభమవుతాయి. ఆర్ట్స్, కామర్స్ విభాగం పరీక్షలు ఈనెల 17 న ఒడియా పేపర్‌తో ప్రారంభమవుతాయి. అలాగే వృత్తి విద్యా విభాగం పరీక్షలు ఈనెల 19న ఇంగ్లిష్ పేపర్‌తో ప్రారంభమవుతాయి.

వేద మండపం నిర్మాణానికి భూమిపూజ



వేద మండపానికి భూమిపూజ చేస్తున్న రబినందో తదితరులు

జయపురం: పట్టణంలో వేద మండపం నిర్మాణానికి కొరాపుట్ బ్రాహ్మణ సమాజ్ గురువారం భూమిపూజ నిర్వహించింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి రబినారాయణ నందో మాట్లాడుతూ.. వేద మండపం నిర్మాణం వలన బ్రాహ్మణ పిల్లలు వేదభ్యాసం చేసేందుకు ఉపకరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన పట్నాయక్ 5టీ పథకంలో భాగంగా వేద మండప నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేశారని వెల్లడించారు. మండప నిర్మాణం పూర్తైన తర్వాత దాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు మరికొన్ని నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. జిల్లా బ్రాహ్మణ సమాజ్ అధ్యక్షుడు ఉపేంద్ర మిశ్ర మాట్లాడుతూ బ్రాహ్మణ సమాజ్ మండప నిర్మాణానికి రబినారాయణ నందో ఎంతో సహకరించారన్నారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, 5టీ చైర్మన్ వీకే పాండ్యన్‌లకు బ్రాహ్మణ సమాజ్ తరఫున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మహిళా బీజేడీ నాయకురాలు డాక్టర్ ఇందిర నందో, జిల్లా బ్రాహ్మణ సమాజ్ కోశాధికారి రమేష్ త్రిపాఠీ, కార్యనిర్వాహక కార్యదర్శి నవకృష్ణ రౌత్, జర్నలిస్ట్ నబో చౌధరి, కిశోర్ పండ, శంకర ప్రసాద్ దాస్, మణురథ్, హరిప్రసాద్ మిశ్ర, బాబు బాయ్ భజరంగ్, గణేష్ పాఢి, కృష్ణ కేశవ షాడంగి తదితరులు పాల్గొన్నారు.

'ల్యాంపుల సామర్థ్యం పెంచేందుకు చర్యలు'



మాట్లాడుతున్న ఈశ్వర చంద్ర పాణిగ్రాహి

జయపురం: రైతులు, వ్యవసాయ ప్రగతికి అండగా నిలుస్తున్న ల్యాంపుల సామర్థ్యం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర పాణిగ్రాహి తెలియజేశారు. స్థానిక కేంద్ర సహకార బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయ సభా గృహంలో కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ ఆధీనంలోని ల్యాంప్స్ నిర్వాహకుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ల్యాంపునకు రూ.50 వేలు చొప్పున ప్రోత్సాహక నిధి మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో రాష్ట్ర సహకార బ్యాంక్ అధ్యక్షుడు టి.ప్రసాదరావు దొర తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు ట్రేడ్ యూనియన్ల పిలుపు



ఆటోతో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: గజపతి జిల్లావ్యాప్తంగా సార్వత్రిక సమ్మెకు ఏఐటీయూసీ, మిళిత ట్రేడ్ యూనియన్స్ పిలుపు మేరకు జిల్లా ఫార్వర్డ్ బ్లాక్ అధ్యక్షుడు పైల మురళీకృష్ణ కాశీనగర్, పర్లాకిమిడిలో గురువారం ప్రచారం చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రైవేట్ ఉద్యోగుల వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్త సమ్మెకు వివిధ ట్రేడ్ యూనియన్లు పిలుపునిచ్చాయి.

ప్రఫుల్ల సామల్ ఇంటిపై ఈడీ దాడులు

భువనేశ్వర్: భూ కుంభకోణం ఆరోపణలపై బిజూ జనతా దళ్ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్యే ప్రఫుల్ల సామల్ ఇంటిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం దాడులు చేసింది. రూ.20 కోట్ల భూ కుంభకోణానికి సంబంధించి భద్రక్, భువనేశ్వర్‌లోని ఆయనకు సంబంధించిన ఇళ్లు, కార్యాలయాల్లో ఏకకాలంలో ఈ దాడులు చేపట్టారు. భద్రక్ బొరొపొదా ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన ఆర్థిక అవకతవకలతో ఈ దాడులు ముడిపడి ఉన్నట్లు సమాచారం. అయితే దాడులపై ఈడీ అధికారులు ఎటువంటి ప్రకటన విడుదల చేయలేదు.

శ్రీకాకుళంలో రేపు జాబ్‌మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం ఆధ్వర్యంలో డీఎల్‌టీసీ/ఐటీఐ శిక్షణ కేంద్రం వేదికగా ఈ నెల 17వ తేదీన జాబ్‌మేళా జరగనుందని జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ తెలిపారు. శనివా రం ఉదయం 10.30 గంటల నుంచి ఈ మేళా జరగనుందని చెప్పారు. క్యాలిబర్ కంపెనీలో వివిధ హోదాల్లో 80 పోస్టు లు, ఫ్యూచర్ మైక్రో ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీలో 70 పోస్టుల ను భర్తీ చేసేందుకు ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు చెప్పా రు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగి కనీసం ఇంటర్మీడియెట్ ఆపైన కోర్సులు కలిగిన గల యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైనవారికి ఆకర్షణీయమైన జీతంతో పాటు ఇతర రాయితీలు అందజేస్తాయన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన యువత తమ బయోడేటా, సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డుతో హాజరు కావాలని కొత్తలంక సుధ కోరారు. అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

ఉపాధ్యాయుల ఉదారత



పల్లవి కుటుంబసభ్యులకు నగదు సాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

పోలాకి: మండలంలోని ఉపాధ్యాయులు తమ వద్ద చదువుకుంటున్న విద్యార్థినికి క్యాన్సర్ చికిత్స కోసం ఆర్థిక సాయం చేశారు. ముప్పిడి ప్రాథమిక పాఠశాల విద్యార్థిని గంగు పల్లవి కంటికి సంబంధించిన క్యాన్సర్‌తో బాధ పడుతోంది. ఈ విషయం టీచర్లకు తెలియడంతో మండలంలోని ఉపాధ్యాయులంతా కలసి రూ.94,500 ను సేకరించి విద్యార్థిని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి టి.లింగరాజు, స్థానిక ప్రధానోపాధ్యాయులు బి.శ్యామలరావు, ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు చింతాడ దిలీప్ కుమార్, నర్సింహులు, రాజేష్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నవీన్ ఒడిశా అవగాహన శిబిరం



వేదికపై బీజేడీ నాయకులు



సభలో పాల్గొన్న ప్రజలు

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి బీర్ లక్ష్మణ్‌పూర్ పంచాయతీలో అమో ఒడిశా - నవీన్ ఒడిశా అవగాహన శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేడీ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గిరిజనులకు పుట్టుక నుంచి మరణం వరకు ప్రతీ దశలో పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. రూపాయికి కిలో బియ్యం పథకం ఇక్కడి నుంచే ప్రారంభించారన్నారు. ఇప్పుడు రైతులకు ఉపయోగపడే అనేక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతీ పంచాయతీకి లక్ష్మీ బస్సులు వెళ్తున్నాయని తెలియజేశారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి బలప్రదర్శన పోటీలు



155 కిలోల బరువు ఎత్తుతున్న గోవిందరావు

సారవకోట: కిన్నెరవాడ గ్రామంలో జిల్లాస్థాయి బల ప్రదర్శన పోటీలను గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. వీరబ్రహ్మేంద్ర స్వామి, గ్రామదేవత ఆలయ వార్షికోత్సవాలను పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ నాయకులు పంచిరెడ్డి సూర్యనారాయణ, రాంబాబు ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. పురుషుల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 155 కిలోల బరువు ఎత్తి ఆవల గోవిందరావు ప్రథమ, 140 కేజీలు ఎత్తిన షేక్ రజాక్ ద్వితీయ స్థానాలను దక్కించుకున్నారు. అలాగే మహిళల విభాగంలో పి.రాజ్యలక్ష్మి, సీహెచ్ హారిక ప్రథమ, ద్వితీయ స్థానాలో నిలిచారు. 80 కిలోల విసురుగుండు విభాగంలో గేదెల సత్యన్నారాయణ, షేక్ రజాక్‌లు మొదటి రెండు రెండుస్థానాల్లో, 104 కిలోల సంగిడీ విభాగంలో గేదెల సత్యన్నారాయణ, ఆవల గోవిందరావులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో, 200 కిలోల ఈడ్పు సంగిడీ విభాగంలో ఆవల గోవిందరావు, గేదెల సత్యన్నారాయణ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వీరికి నిర్వాహకులు దాము సత్యన్నారాయణ, ఇప్పిలి వేణు గోపాలరావు, పంచిరెడ్డి రాంబాబు బహుమతులు అందజేశారు. కిన్నెరవాడ, వడ్డినవలస గ్రామాల్లో 2016 నుంచి జరుగుతున్న బల ప్రదర్శన పోటీల్లో ఆవల గోవిందరావు విశేష ప్రతిభ కనబర్చుతుండటంతో ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.

పారదర్శకంగా సామాజిక తనిఖీలు



మాట్లాడుతున్న ఎంపీడీవో త్రివిక్రమరావు

కొత్తూరు: ఉపాధి హామీ పథకంలో భాగంగా చేసిన పనులపై సామాజిక తనిఖీలు పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందికి ఎంపీడీవో త్రివిక్రమరావు సూచించారు. మండలంలో ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న సామాజిక తనిఖీలకు సంబంధించిన బృందాలు, ఫీల్డు అసిస్టెంట్లు, సిబ్బందితో స్థానిక ఉపాధి కార్యాలయంలో ఏపీవో ప్రేమలత ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. తనిఖీ బృందాలకు ఫీల్డు అసిస్టెంట్లు సహకరించాలన్నారు. గ్రామ సభలకు సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, వేతనదారులు హాజరయ్యేలా చూడాలన్నారు. తనిఖీ బృందాలు ఇంటింటా తనిఖీలు చేసే సమయంలో ఫీల్డు అసిస్టెంట్లు ఉండకూడదన్నారు. చివరి వేతనం పడిన తేదీ వరకు జాబ్ కార్డులు అప్‌డేట్ చేసి ఉంచాలన్నారు. తనఖీ బృందాలకు అవసరమైన రికార్డులు అందించాలన్నారు. సమావేశంలో ఎస్ఆర్‌సీపీ ఎం.వెంకటరావు, డబ్ల్యూఎంఏ ఎల్.గోవిందరావు, ఈసీ శ్రావణి ఉన్నారు.

గ్రిగ్స్ పోటీల్లో కొరసవాడ విద్యార్థుల ప్రతిభ



కొరసవాడ విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పాతపట్నం: టెక్కలిలో జరిగిన జోన్-2 స్కూల్ లెవెల్ గ్రిగ్స్ పోటీల్లో కొరసవాడ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని హెచ్ఎం బి.సింహాచలం చెప్పారు. విజేతలను పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. కబడ్డీ, షాట్ పుట్, 300, 1500 మీటర్ల రన్నింగ్, ట్రిబుల్, లాంగ్, హైజంప్ విభాగాల్లో 17 మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. అలాగే పెద్దసీది జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆల్‌రౌండర్ చాంపియన్‌గా నిలిచారని పీడీ సిమ్మ కృష్ణారావు తెలిపారు. విజేతలను హెచ్ఎం బి.రామమూర్తి, మధుసూదనరావు, ఉపాధ్యాయులు అభినందించారు. పీఈటీ జె.కృష్ణ, మహాలక్ష్మి, ఎం.రామారావు ఉన్నారు.

పరీక్షల సన్నద్ధతపై అవగాహన

నరుబుజ్జిలి: విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చునని శ్రీకాకుళం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం దూసి సూర్యవిజయభరద్వాజ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల సన్నద్ధతపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ప్రతిఒక్కరూ సేవా భావం అలవాటు చేసుకోవాలని ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు సూచించారు. తాను ఏడవ ఏటనే కంటి చూపు లేక, తండ్రిని కోల్పోయినప్పటికీ కృంగిపోకుండా మనోనిబ్బరంతో ముందడుగువేసి ఉద్యోగం సాధించానని గుర్తు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు, ఎన్ఎస్ఎస్ పీవో రమేష్‌షాహు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలి'



పంచాయతీ కార్యాలయం వద్ద ఇళ్ల స్థల పట్టాల రిజిస్ట్రేషన్‌కు వచ్చిన లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

నరసన్నపేట: సార్వత్రిక ఎన్నికలకు మండల స్థాయిలో ఉన్న సిబ్బందిని సిద్ధం చేయాలని, ప్రధానంగా బీఎల్‌ఓల పనితీరును బాగా మెరుగుపరచాలని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. నరసన్నపేట తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా గురువారం తనిఖీ చేసిన కలెక్టర్ అనంతరం పంచాయతీ కార్యాలయం వద్ద సచివాలయాన్ని, ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని, డిగ్రీ కళాశాల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులతో కొద్ది సేపు మాట్లాడి వారి టార్గెట్స్ అడిగి తెలుసుకున్నారు. అలాగే సచివాలయంలో సిబ్బంది పనితీరును ప్రత్యేకంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు, కేంద్రాల్లో సౌకర్యాలు, వికలాంగులు వచ్చేందుకు ర్యాంపులు గురించి ఈఆర్‌ఓ రామ్మోహనరావు, ఏఆర్ఓ కనకారావులను ప్రశ్నించి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో దేనికీ ఇబ్బంది ఉండకూడదని ఒకటికి పదిసార్లు పరిశీలించి సౌకర్యాలు మెరుగు పరచాలని సూచించారు. అలాగే పంచాయతీ కార్యాలయంలో బీఎల్‌ఓ పనితీరును తెలుసుకున్నారు. ఈసందర్భంగా బీఎల్‌ఓ సరైన సమాధానాలు ఇవ్వక పోవడంతో వారికి అవగాహన కలిగించాలని ఆదేశించారు. అంతకు ముందు తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది పనితీరు, అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆన్‌లైన్‌లో మ్యూటేషన్ కోసం దరఖాస్తులు పెండింగ్ ఉన్నట్లు గమనించి వెంటనే వాటిని క్లియర్ చేయాలని తహసీల్దార్‌కు ఆదేశించారు. పంచాయతీలో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, సిబ్బంది పనితీరుపై పంచాయతీ కార్యదర్శి సవర చిన్నారావును ప్రశ్నించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సౌకర్యాలపై ఆరా తీశారు.

కథా నిలయం సందర్శన



కథానిలయంలో తెలుగు వెలుగు సాహిత్యవేదిక సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు వెలుగు సాహిత్య వేదిక ప్రతినిధులు కథానిలయంను గురువారం సందర్శించి కారా మాస్టారు తనయులు కాళీపట్నం సుబ్బారావును కలసి కథానిలయం విశేషాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తెలుగు వెలుగు సాహిత్య వేదిక ప్రధాన కార్యదర్శి మోటూరి నారాయణరావు మాట్లాడుతు కథానిలయం, కారాపై ఒక సంకలనం తీసుకువచ్చిందని అన్నారు. సమావేశంలో సుబ్బారావు మాట్లాడుతూ కథానిల యం వార్షికోత్సవాలు ఇకపై రెండు తెలుగు రాష్ట్రా ల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 24న హైద రాబాద్‌లో కథానిలయం వార్షికోత్సవం నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు భాషా దినోత్సవం పోస్టర్‌ను తెలు గు సహిత్య వేదిక ప్రతినిధులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఇస్రో శాస్త్రవేత్త డబ్బీరు వెంక టశరత్‌కవి, జె.వి.కుమార్, అరవల రవీంద్రబా బు, వినోద్, బి.ఉమామహేశ్వరరావు, కథానిలయం కార్యదర్శి దాసరి రామచంద్రరావు పాల్గొన్నారు.

'ఇన్‌స్పైర్' చేశారు



కళాశాల డైరెక్టర్ నాగేశ్వరరావును సన్మానిస్తున్న జిల్లా విద్యా శాఖాధికారి వెంకటేశ్వరరావు

- ఆదర్శప్రాయంగా ఇన్‌స్పైర్ మనాక్ సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన
- రాష్ట్రస్థాయికి ఎంపికైన 16 ప్రాజెక్టులు

టెక్కలి:

స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల వేదికగా గురువారం నిర్వహించిన 11వ జిల్లా వైజ్ఞానిక ప్రాజెక్టు ప్రదర్శన అబ్బురపరిచింది. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు సమాజానికి ఉపయోగపడేలా వివిధ రకాల సైన్సు ప్రాజెక్టుల రూపకల్పన వైపు దృష్టి సారించి భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని జిల్లా విద్యా శాఖాధికారి కె.వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 164 ప్రాజెక్టులతో విద్యార్థులు హాజరయ్యారు. ఈ ప్రదర్శనల్లో భాగంగా 16 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, జిల్లా సైన్స్ అధికారి కె.కుమారస్వామి, ఉప విద్యా శాఖాధికారి ఆర్.విజయకుమారి, ఎన్ఐఎఫ్ జూనియర్ సైంటిస్ట్ అభినాష్, కళాశాల ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకులు ఆర్.శ్రీరాములు, ఎంఈఓలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రాజెక్టులు

- స్మార్ట్ క్రాప్ ప్రొటెక్షన్ సిస్టమ్ ఫ్రమ్ యానిమల్స్ అండ్ ఫైర్ యూజింగ్ ఆర్డినో (సొర్రా జ్యోత్స్న, జెడ్పీహెచ్ఎస్, రంగోయి)
- ఉమెన్ సేఫ్టీ అండ్ ట్రాకింగ్ సిస్టమ్(సాహుకారి గౌతమి, జీహెచ్ఎస్, కస్పా నౌపడ)
- ఆటోమేటిక్ సీడ్ సౌయింగ్ స్ప్రేయింగ్ అండ్ వీడింగ్ అగ్రికల్చరల్ రోబోట్ (మల్లూరి పూర్ణసాయి, టింపనీ స్కూల్, శ్రీకాకుళం)
- లాట్ బేస్డ్ స్మార్ట్ అగ్రికల్చర్ మానిటరింగ్ సిస్టమ్ (గొలివి ధనుంజయ్, కిల్లిపాలెం, శ్రీకాకుళం రూరల్)
- యాక్టివేటెడ్ చార్‌కోల్ బేంబూ బాస్కెట్ (బోనెల పల్లవి, ఏపీ మోడల్ స్కూల్, కుప్పిలి)
- సౌండ్ అండ్ లైట్ ఎమిటేటింగ్ డివైజ్ టు రెడ్యూస్ ఎలక్ట్రిక్ షాక్స్ ఇన్ స్ట్రీట్ లైన్స్ (ముడిసి సోనియా, సత్యసాయి స్కూల్, ఇచ్ఛాపురం)
- మల్టీ పర్పస్ ఇన్నోవేటివ్ చీపెస్ట్ లోడ్ క్యారీయర్ ఫర్ ఏబౌర్ (గేదెల బిందుమాధవి,జెడ్పీహెచ్ఎస్, కంచిలి)
- ఫిల్టరేషన్ ఆఫ్ కార్బన్ ఫ్రమ్ పొల్యూటెంట్స్ బై డైనమిక్ ఫిల్టర్ విత్ అవుట్ వాటర్ (సావుకారి ఇందు, కెజీబీవీ, జి.సిగడాం)
- థెఫ్ట్ డిటెక్షన్ సిస్టమ్ ఇన్ ఏటీఎం యూజింగ్ క్లోరోఫామ్ (సనపల మనోహర్, నారాయణ, రణస్థలం)
- హీరాయిన్స్ ఫౌంటేన్ ఏ సోర్స్ ఆఫ్ ఎనర్జీ జనరేషన్ (నెయ్యిల మణికంఠ, జీహెచ్ఎస్, టెక్కలి)
- యాక్సిడెంట్ ఐడెంటిఫికేషన్ అండ్ అలెర్టింగ్ సిస్టమ్ (సుత్రోయ్ సుష్మా, జెడ్పీహెచ్ఎస్, నౌగాం, నందిగాం)
- బిన్ ఫైర్ కిచెన్ ఇన్ హోమ్ (కరణం శ్రావ్య, జెడ్పీ హెచ్ఎస్, చిన్నకిట్టాలపాడు, సారవకోట)
- స్మార్ట్ డ్రైనేజ్ ఎట్ హౌస్ హోల్డ్ లెవల్ (అట్ల మహేష్,ఏపీ మోడల్ స్కూల్, సోంపేట)
- క్యాజ్యూ నట్ పికింగ్ మెషిన్ (పిన్నింటి సీతారాం ;జెడ్పీహెచ్ఎస్, మామిడిపల్లి, సోంపేట)
- వాటర్ క్లీనింగ్ రోబోట్ (వావిలాపల్లి దివ్య, జెడ్పీ హెచ్ఎస్, పిల్లలవలస, పొందూరు)

క్లుప్తంగా

అనన్య ప్రతిభ

సంతకవిటి: మండల పరిధిలోని మందరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ఉరిటి అనన్య రాష్ట్రస్థాయిలో జరిగిన ఈఈఎంటీ (విద్యాసామర్థ్యంలో ప్రతిభ) పరీక్షలో జిల్లాస్థాయిలో ప్రథమస్థానం సాధించింది. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవిశంకర్ గురువారం తెలిపారు.ఈ నెల 17న పాఠశాల విద్యాశాఖ కమిషనర్ చేతులమీదుగా మెమెంటో, సర్టిఫికెట్, క్యాష్‌ప్రైజ్‌ను తమ విద్యార్థిని అందుకుంటుందని చెప్పారు.

కిక్‌బాక్సింగ్‌లో జిల్లాకు పతకాలు



సాధించిన పతకాలతో కిక్‌బాక్సింగ్ క్రీడాకారులు

విజయనగరం: ఈనెల 10,11 తేదీల్లో పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయిలో జరిగిన కిక్‌బాక్సింగ్ పోటీల్లో విజయనగరం క్రీడాకారులు పతకాలు సాధించారు. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన 8 మంది క్రీడాకారుల్లో వి.దుర్గారవి, ఎ.చంద్రమౌళి, ఆర్.వంశీవరుణ్, పి.భార్గవ్, ఎస్.మధు బంగారు పతకాలు సాధించారు. అలాగే పి.హేమంత్, కె.శివగణేష్, వై.భూలోక్‌లు వెండి పతకాలు కైవసం చేసుకున్నట్లు కోచ్ సంతోష్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను సీతం కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు, సత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సాయిదేవమణి అభినందించారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల కప్ ఆవిష్కరణ



కప్‌ను ఆవిష్కరిస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

రాజాం సిటీ: రాజాంలో జరగనున్న 2వ రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు సంబంధించి ఓవరాల్ చాంపియన్ షిప్ కప్‌ను వాసవీక్లబ్ సభ్యులు గురువారం ఆవిష్కరించారు. ఈ నెల 18న జరగనున్న పోటీలకు 15 జిల్లాల నుంచి హాజరుకానున్న క్రీడాకారులకు ఫైనల్‌లో అందించే కప్‌ను వాసవీక్లబ్ మనరాజాం-సారథి సభ్యులు సమకూర్చారని కరాటే మాస్టర్ ఆర్.శివ తెలిపారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ జోన్ చైర్మన్ డాక్టర్ గ్రంధి రవికుమార్, అంబరీష్, కామేష్, అశోక్, ధనుంజయ్, మన్మథ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల చొరవతో చైల్డ్ లైన్ చెంతకు బాలుడు



విక్రమ్

విజయనగరం టౌన్: స్థానిక తోటపాలెంలో తిరుగుతున్న బాలుడు విక్రమ్‌ను పోలీసులు చొరవ తీసుకుని చైల్డ్‌లైన్ చెంతకు చేర్చారు. స్థానికుల సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు బాలుడి నుంచి వివరాలు సేకరించారు. తన తల్లిదండ్రులు రాజు, అనిత రోడ్డు ప్రమాదంలో మృతిచెందారని, ధర్మపురిరోడ్డులో ఉండే ఇల్లును కూడా ఇప్పుడు కూల్చేశారని వాపోయాడు. తనకెవరూ లేరని, అనాథనని చెప్పడంతో చైల్డ్‌లైన్‌కి సమాచారమిచ్చి బాలుడిని అప్పగించినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు. ఎవరైనా బాలుడి బంధువులు ఉంటే స్పందించాలని కోరారు.

రాములోరి కల్యాణానికి నేడు పందిరి రాట

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో ఈ నెల 20న జరిగే సీతారామస్వామి కల్యాణోత్సవానికి తూర్పురాజగోపురం వద్ద శుక్రవారం పందిరిరాట వేస్తామని అర్చకులు తెలిపారు. ఆలయ క్షేత్ర పాలకులైన ఉమా సదాశివుడి ఆలయంలో ఆదివారం రాత్రి 8 గంటలకు శివ, పార్వతుల వార్షిక కల్యాణాన్ని జరిపిస్తామన్నారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు జరిపించి ఈ నెల 20న రాత్రి 9.30 గంటలకు సీతారాముల తిరుక్కల్యాణ మహోత్సవం జరిపిస్తామని చెప్పారు.

గిరిజన గృహాలకు ఉచిత విద్యుత్

- ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ లక్ష్మణరావు

విజయనగరం ఫోర్ట్: విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలోని గిరిజన గృహాలకు పీఎం జనమన్ పథకం కింద ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ మువ్వల లక్ష్మణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 1399 గిరిజన గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు. ఎవరికైనా ఇప్పటి వరకు విద్యుత్ సౌకర్యం లేకుంటే సంబంధిత ఏఈ కార్యాలయంలో కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, రేషన్ కార్డు జెరాక్సులు అందజేసి విద్యుత్ సౌకర్యం పొందాలని కోరారు.

సర్వజన ఆస్పత్రిలో కేన్సర్ చికిత్స

- సర్వజన ఆస్పత్రిలో వ్యాధి నిర్ధారణ
- ఏడాదిలో 86,478 మందికి పరీక్షలు
- నోటి కేన్సర్‌లే అధికం
- సకాలంలోగుర్తిస్తే చికిత్స



సర్వజన ఆస్పత్రిలో ఎఫ్ఎన్ఏసీ పరీక్ష చేస్తున్న వైద్యుడు



నోటి కేన్సర్‌ను గుర్తించే పరికరంతో పరీక్షిస్తున్న వైద్యుడు

విజయనగరం ఫోర్ట్: కేన్సర్ వ్యాధి విజృంభిస్తోంది. వ్యాధిగ్రస్తుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. కేన్సర్ మహమ్మారిని సకాలంలో గుర్తించకపోవడం వల్ల వ్యాధి ముదిరి మృత్యువాత పడుతున్నారు. వ్యాధిని చివరి దశలో గుర్తించడం వల్ల చికిత్స అందించినా ఫలితం లేకపోతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కేన్సర్ వ్యాధికి చెక్ పెట్టేందుకు శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో వ్యాధిని త్వరగా గుర్తించడం ద్వారా ప్రాథమిక స్థాయిలో చికిత్స అందించి పూర్తిగా నయం చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు కేన్సర్‌ను త్వరగా గుర్తించేందుకు జిల్లాకేంద్రంలోని సర్వజన ఆస్పత్రిలో స్క్రీనింగ్ సెంటర్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈసెంటర్‌లో అన్ని రకాల కేన్సర్‌లకు స్క్రీనింగ్ చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణ అయిన కొన్ని కేసులకు సర్వజన ఆస్పత్రిలోనే శస్త్రచికిత్స చేస్తున్నారు.

అన్ని రకాల కేన్సర్‌లకు పరీక్ష

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన స్క్రీనింగ్ సెంటర్‌లో అన్ని రకాల కేన్సర్‌లకు స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నారు. కొన్ని కేసులను పాప్స్మీర్, ఎఫ్ఎన్ఏసీ, బయాప్సీపరీక్ష ద్వారా నిర్ధారిస్తున్నారు. మరి కొన్నింటిని అల్ట్రాసౌండ్ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్ ద్వారా నిర్ధారిస్తున్నారు. మహిళల్లో వచ్చే సర్వేకల్ కేన్సర్ (గర్భాశయ ముఖం ద్వారా)ను పాప్స్మీర్, ఎఫ్ఎన్ఏసీ, బయాప్సీ పరీక్ష చేసి నిర్ధారిస్తున్నారు. బ్రెస్ట్ కేన్సర్, (రొమ్ముకేన్సర్) ప్రొస్టేట్ కేన్సర్, స్టమక్ కేన్సర్‌లను అల్ట్రాసౌండ్ ద్వారా నిర్ధారిస్తున్నారు. రొమ్ముకేన్సర్ నిర్ధారణ అయినవారికి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో జనరల్ సర్జరీ విభాగం వైద్యులు శస్త్రచికిత్స చేసి చికిత్స అందిస్తున్నారు. ఖైనీ గుట్కా, పాన్‌పరాగ్ తినేవారిలో వచ్చే నోటి కేన్సర్‌ను దంతవైద్యులు పరీక్షిస్తున్నారు. ఊపిరితిత్తులు కేన్సర్, బ్రెయిన్ ట్యూమర్ (మొదడు కేన్సర్)ను ఎంఆర్ఐ స్కాన్ ద్వారా నిర్ధారణ చేస్తున్నారు.

జిల్లా ఆస్పత్రికి రిఫరల్స్

పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు వచ్చే రోగుల్లో కేన్సర్ లక్షణాలు కనిపిస్తే వారిని స్క్రీనింగ్ చేసేందుకు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నారు.

వేలాది మందికి పరీక్షలు

జిల్లాలో 2023 జనవరి నెల నుంచి డిసెంబర్ నెలాఖరు నాటికి 86,478 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 548 మందికి కేన్సర్ నిర్ధారణ అయింది. ఆ కేసుల్లో నోటి కేన్సర్‌లే అధికం. 30,735 మందికి నోటి కేన్సర్ పరీక్షలు చేయగా 274 మందికి, 14, 440 మందికి బ్రెస్ట్ కేన్సర్ పరీక్షలు చేయగా 153 మందికి, 41,303 మందికి గర్భాశయ కేన్సర్ పరీక్షలు చేయగా 171 మందికి వ్యాధి నిర్ధారణ అయింది.

వ్యాధి రావడానికి కారణాలు:
- జన్యుపరంగా రావచ్చు.
- పాన్‌పరాగ్, ఖైనీ, గుట్కా, పాన్ మసాలా, చుట్ట, బీడీ, సిగరెట్ వంటివి తాగడం వల్ల నోటి కేన్సర్ వచ్చే ప్రమాదం
- మహిళలు పరిశుభ్రత పాటించకపోవడం వల్ల, ఎక్కువ మందితో లైంగిక సంబంధాలు కలిగి ఉండడం.

వ్యాధిని తొలిదశలో గుర్తిస్తే నయం



కేన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించగలిగితే తక్కువ ఖర్చుతో నయం చేయవచ్చు. జీవితకాలాన్ని పెంచవచ్చు. కేన్సర్ ఇతర భాగాలకు వ్యాపించకుండా కాపాడడానికి అవకాశం ఉంటుంది. కేన్సర్‌ను చివర దశలో గుర్తిస్తే చికిత్సకు ఎక్కువ ఖర్చుఅవడమే కాకుండా నయం చేయడం కూడా కష్టతరమ వుతుంది. సర్జరీ, కీమోథెరపి, రేడియోథెరపి ద్వారా కేన్సర్‌ను నయం చేయవచ్చు. డాక్టర్ మురళీకృష్ణ, ఎన్‌సీడీ, వైద్యాధికారి

కేజీబీవీ విద్యార్థిని అదృశ్యం



తప్పిపోయిన విద్యార్థిని గురించి వివరాలు అడుగుతున్న డిప్యూటీ ఈవో కృష్ణమూర్తి

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి కేజీబీవీలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని (14) అదృశ్యమైనట్లు ప్రిన్సిపాల్ మరడాన శ్రీదేవి గురువారం ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఎస్సై చిన్నంనాయుడు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామానికి చెందిన బాలిక 14న బుధవారం ఉదయం 11 గంటల నుంచి కనిపించలేదని, స్నేహితులు, బంధువులు, తల్లిదండ్రులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో హెచ్‌ఎం చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

డిప్యూటీ ఈవో దర్యాప్తు

కేజీబీవీలో విద్యార్థిని అదృశ్యమైనట్లు తెలియడంతో డిప్యూటీ విద్యాశాఖాధికారి పి కృష్ణమూర్తి, ఎంఈవో-1 నాగభూషణరావు, ఎంఈవో-2 శ్రీనివాసరావులు గురువారం పాఠశాలకు వచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీదేవిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఆమె నేత్రాలు సజీవం



నేత్రదానం చేసిన కనకరత్నం (ఫైల్)

చీపురుపల్లి: మనిషి మరణం శరీరానికే తప్ప నేత్రాలకు కాదని, మరణానంతరం నేత్రాలు మరొకరికి చూపునిస్తాయని నమ్మి.. తమ తల్లి నేత్రాలను కుమారులు దానం చేశారు. పట్టణంలోని డైలీ మార్కెట్‌కు చెందిన పట్నాన కనకరత్నం(78) గురువారం గుండెపోటుతో మరణించారు. తల్లి మరణించిందన్న దుఃఖాన్ని పక్కన పెట్టిన కుమారులు తవిటయ్య, శ్రీనివాసులు ఆమె నేత్రాలు దానం చేసి మరో ఇద్దరికి చూపు ప్రసాదించాలని నిర్ణయించారు. ఈ మేరకు పట్టణానికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బీవీ గోవిందరాజులును సంప్రదించారు. తక్షణమే స్పందించిన ఆయన శ్రీకాకుళం రెడ్‌క్రాస్ సొసైటీకి సమాచారం ఇవ్వగా అక్కడి నుంచి వచ్చిన టెక్నీషియన్ సుజాత..వలంటీర్ల సహకారంతో మృతురాలు కనకరత్నం నేత్రాలు సేకరించారు.

44మద్యం సీసాలు సీజ్

- నిందితుడి అరెస్ట్

గజపతినగరం: మండలంలోని మరుపల్లి గ్రామంలో 44 మద్యం సీసాలు సీజ్ చేసి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఆయన పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు గ్రామంలో మద్యం అమ్మకాలు చేస్తున్న దేవర రాము(43) షాపుపై దాడి చేసి 44 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసి ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

బీసీ రిజర్వేషన్ వచ్చేవరకూ నిరసనలు



నల్లరిబ్బన్లతో నిరసన వ్యక్తం చేస్తున్న తెలగ సంఘం నాయకులు

- ఉత్తరాంధ్రా తెలగ సంఘం అధ్యక్షుడు చనుమల్ల

విజయనగరం టౌన్: తెలగ కులస్తులకు బీసీ రిజర్వేషన్ నేటి పరిస్థితుల్లో తప్పనిసరి అని, దీన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే వరకూ పోరాటాలు, నిరసనలు ఉద్ధృతం చేస్తామని ఉత్తరాంధ్రా తెలగ సంఘం అధ్యక్షుడు చనుమల్ల ప్రసాదరావు పేర్కొన్నారు. జిల్లా తెలగ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరాహార దీక్షల్లో భాగంగా రెండో రోజు గురువారం నల్లరిబ్బన్‌లను నోటికి కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ఓసీ కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు 1915 నుంచి 1966 వరకూ ఉన్న రిజర్వేషన్‌లను పునరుద్ధరించాలని కోరారు. మంజునాథన్ కమిషన్ వేసిన నివేదికను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ అయితే కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు రిజర్వేషన్ ఇస్తుందో ఆ పార్టీకి తమ పూర్తి మద్దతిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తాడి నానాజీ, రామారావు, కూనిశెట్టి శాంతి పాల్గొన్నారు.

సందడి లేని శంఖారావం



రాజాం: సభ ముగియగానే డబ్బులు పంపిణీ చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

- రాజాం సభలకు దూరంగా కిమిడి, ప్రతిభాభారతి వర్గాలు
- కోండ్రు మురళీమోహన్ వర్గం నిరుత్సాహం
- బయటపడిన విభేదాలు
- చీపురుపల్లిలో స్పందన శూన్యం

రాజాం/చీపురుపల్లి/చీపురుపల్లి రూరల్: కూర్చోమని కుర్చీలు ఆహ్వానిస్తున్నప్పటికీ కనబడని ప్రజలు.. రా రమ్మని పిలుస్తున్నా.. పట్టించుకోని స్థానికులు.. ముఖం చాటేసిన పార్టీ పెద్ద నాయకులు.. బయటపడిన విభేదాలు, ఆశావహుల్లో నిరాశ.. మొత్తంగా టీడీపీ నాయకుడు నారా లోకేశ్ రాజాం, చీపురుపల్లిలో గురువారం నిర్వహించిన శంఖారావం సభల దుస్థితి ఇది.

రాజాం పట్టణంలోని పాలకొండరోడ్డులో సీతారామ థియేటర్ పక్కన లెక్కమీద కుర్చీలు వేసి ఏర్పాటుచేసిన నారా లోకేశ్ శంఖారావం సభ చప్పగా సాగింది. షెడ్యూల్ ప్రకారం 10.30 గంటలకు సభ ప్రారంభం కావాల్సి ఉండగా, జనాలు రాకపోవడంతో మరో 30 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభించారు. వేసిన 1800 కుర్చీలు కూడా నిండకపోవడంతో రాజాం పట్టణంలోని పలువార్డులలో జనాలతో పాటు గురువారం సంతకు వచ్చే వ్యాపారులకు డబ్బులు ఆశ చూపి సభకు తీసుకొచ్చారు. జనాలు తక్కువగా ఉన్నారని ఆలోచించి తొలుత కిమిడి నాగార్జునతో సభ ప్రారంభించారు. అప్పటికీ జనాలు రాకపోతే మరో పది నిమిషాలు వాయిదావేశారు. అనంతరం నారా లోకేశ్ సభావేదికపైకి రాగా, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ ఆవేశంగా మాట్లాడి అలిసిపోయినా ప్రజలు నుంచి స్పందన రాలేదు. లోకేశ్ సభను ప్రారంభించి ఎర్రబుక్కును పదేపదే చూపిస్తూ ప్రసంగించడమే కాకుండా రాష్ట్ర మంత్రివర్గంపై విమర్శలు గుప్పించారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తామని చెప్పారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను పదేపదే పొగిడినా కానీ రాజాం నియోజకవర్గ అభ్యర్థి పేరును లోకేశ్ ప్రకటించలేక, జనసేన, తాము కలిసి అభ్యర్థిని నిర్ణయిస్తామని, ఆ అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ సభ ముగించారు. జనసేన ఇన్‌చార్జి ఎన్ని రాజు తన పార్టీని పొగడ్తలతో ముంచెత్తమే కాకుండా నియోజకవర్గంలో ఎక్కువగా కాపులు ఉన్నారని, తమ పార్టీకి టిక్కెట్ ఇస్తే బాగుంటుందని సంకేతాలు ప్రసంగం ద్వారా ఇచ్చారు. మరో వైపు ఈ సమావేశానికి స్థానికంగా ఉంటున్న టీడీపీ రాష్ట్ర నాయకుడు కిమిడి కళా వెంకటరావు, ఇదే నియోజకవర్గానికి చెందిన కావలి ప్రతిభా భారతి, కావలి గ్రీష్మ డుమ్మా కొట్టారు. ఇంకోవైపు రేగిడి, రాజాం మండలాల నుంచి టీడీపీ మాజీ ఎంపీపీలు, వారి క్యాడర్ హాజరుకాలేదు.

బస్సులోనే లోకేశ్



చీపురుపల్లిలో హాజరైన అరకొర పార్టీ శ్రేణులు

శంఖారావం సభ నిర్వహించేందుకు గురువారం మధ్యాహ్నం 1.25 గంటలకు నారాలోకేశ్ చీపురుపల్లిలోని సభా ప్రాంగణానికి చేరుకున్నాడు. ఆ తరువాత భోజనం చేసి సభా వేదికకు రావాల్సి ఉంది. మధ్యాహ్నం 3 గంటల వరకు సభా ప్రాంగణం నిండకపోవడంతో బస్సులోనే ఉండి తరువాత సమయం మించిపోతుండడంతో వేదికపైకి వచ్చారు. లోకేశ్ ప్రసంగానికి ముందు చీపురుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి, జిల్లా పార్టీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున అరగంట పాటు ప్రసంగించగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి విజినగిరి శ్రీనివాసరావు అరగంటకు పైగా లోకేశ్‌ను పక్కన పెట్టి ఇష్టారాజ్యంగా ప్రసంగించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. 2014 నుంచి 2019 కాలంలో కిమిడి మృణాళిని ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గాన్ని రూ.వెయ్యి కోట్ల నిధులతో అభివృద్ధి చేశారని, అందులో శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయం కూడా ఉందని చెప్పడంతో అంతా ఆశ్చర్యానికి లోనై ముక్కు మీద వేలేసుకున్నారు. నియోజకవర్గానికి 24 గంటల నిరంతర తాగునీటి పథకాన్ని తీసుకొచ్చినట్టు సత్యదూరమైన ప్రసంగం చేశారు.

20న టిడ్కో ఇళ్ల ప్రారంభోత్సవం



మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి,గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ఈ నెల 20న సాలూరు మండలంలోని గుమడాం సమీపంలో టిడ్కో ఇళ్ల ప్రారంభోత్సవం జరగనున్న నేపథ్యంలో తుది పనులు పూర్తిచేసి సిద్ధంగా ఉంచాలని ఉపముఖ్యమంత్రి,గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన పట్టణంలోని తన స్వగృహంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, కమిషనర్ ప్రసన్నవాణి, పలువురు మున్సిపల్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ,1056 మంది లబ్ధిదారులకు ఈ నెల 20న టిడ్కో ఇళ్లు అందజేయనున్నట్లు తెలిపారు. తనతో పాటు విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ తదితరులు ఇళ్లను ప్రారంభిస్తామని, పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, విధినిర్వహణలో అలసత్వం వహించవద్దని స్పష్టం చేశారు.

బంగారు అభరణాల తయారీ షాపులో చోరీ

కొత్తవలస: మండలంలోని సబ్బవరం రోడ్డులో గల బంగారు ఆభరణాల తయారీ షాపులో బుధవారం అర్ధరాత్రి దొంగలు చొరబడి ఐదున్నర తులాల బంగారు ఆభరణాలను దోచుకుపోయారు. ఈ మేరకు షాపు యజమాని మధు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిన్నపాటి షాపు ఏర్పాటు చేసుకుని బంగారు అభరణాలు తయారు చేసే మధుకు శనివారం వివాహం జరగనుంది. ఈ క్రమంలో బుధవారం కుమ్మరివాధిలో ఇంటి వద్ద పెళ్లికొడుకును చేసే కార్యక్రమం ఉన్నందున షాపు తెరవలేదు. షాపులో తన పెళ్లికి సంబంధించిన కొన్ని బంగారు అభరణాలు, వేరొకరు ఆర్డర్ ఇచ్చిన బంగారు ఆభరణాలు మొత్తం ఐదున్నర తులాలు ఉండగా..దొంగలు తలుపులు విరగ్గొట్టి లోనికి ప్రవేశించి దోచుకుపోయారు. ఈ మేరకు పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేయుగా క్లూస్‌టీమ్ వచ్చి పరిశీలించి వేలుముద్రలను సేకరించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

ఉమ్మడి విజయనగరం జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో గురువారం జరిగిన ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. ఆయా ప్రమాదాల వివరాలు ఇలా ఉన్నాయి.



జామి: సత్యవతి మృతదేహం

జామి: మండలంలోని అలమండ గ్రామంలో లారీ ఢీ కొని ఓ మహిళ మృతి చెందింది. ఈ ప్రమదంపై స్థానికులు అందించిన వివరాల ప్రకారం అలమండ గ్రామానికి చెందిన అప్పిలకొండ సత్యవతి(55) గురువారం తెల్లవారుజామున కళ్లానికి వెళ్తోంది. ఆ సమయంలో గ్రామీణవికాస్ బ్యాంక్ వద్ద పొగమంచు దట్టంగా ఉండడంతో విజయనగరం నుంచి వస్తున్న లారీ ఢీ కొనడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ప్రమాదం జరిగిన వెంటనే లారీని నిలపకుండా డ్రైవర్ పరారయ్యాడు. ఈ వార్త తెలుసుకున్న జామి పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తుచేపడతామని ఎస్సై వీరబాబు తెలిపారు. మృతురాలికి భర్త సత్యనారాయణ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి..



విజయనగరం క్రైమ్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక కోట జంక్షన్ వద్దనున్న గుండాల వారి వీధిలో కొద్దిరోజులుగా తిరుగుతున్న గుర్తు తెలియని వ్యక్తి గురువారం మృతిచెందాడు. ఆ వీధిలో తిరుగుతున్న గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న టూటౌన్ పోలీసులు జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అయితే ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆ వ్యక్తి మృతిచెందినట్లు వైద్యులు తెలియజేశారని, పోలీసులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రి మార్చురీలో భద్రపరిచామని, బంధువులు ఎవరైనా గుర్తిస్తే టూటౌన్ పోలీసులను సంప్రదించాలని సీఐ కోరాడ రామారావు కోరారు.

లారీ ఢీకొని మరో గుర్తు తెలియని వ్యక్తి..

కొత్తవలస: మండలకేంద్రంలోని ఎస్.కోట రోడ్డులో లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి (40) అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం ఉదయం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కొత్తవలస జంక్షన్‌లో ప్లాస్టిక్ బాటిల్స్, చిత్తుకాగితాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తున్న గుర్తు తెలియని వ్యక్తిని ఎల్.కోట మండలం శ్రీరాంపురం గ్రామం సమీపంలో గల స్టీల్‌ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్ కర్మాగారం నుంచి ఇనుప రాడ్ల లోడ్‌తో విశాఖపట్నం వెళ్తున్న లారీ కొత్తవలస జంక్షన్‌లో ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ మేరకు సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు మృతదేహాన్ని ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి వృద్ధురాలు..



సాలూరు: చెరువులో సరోజిని మృతదేహం

సాలూరు: పట్టణంలో వెంకటేశ్వరకాలనీకి చెందిన వృద్ధురాలు బోనుమహంతి సరోజిని (65) చెరువులో పడి మృతిచెందింది. ఈ సంఘటనపై పట్టణ ఎస్సై సురేష్ గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 13న ఇంటి నుంచి బయటకు వెళ్లిన సరోజిని తిరిగి రాలేదని, ఎక్కడ వెతికినా కనిపించ లేదని ఆమె కుమారుడు శ్రీను ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో దర్యాప్తు చేస్తుండగా ఆమె మృతదేహం పట్టణ సమీపంలోని చెరువులో కనిపించింది. అయితే ఆమె మరణంపై ఎటువంటి అనుమానం లేదని కుమారుడు స్పష్టం చేయగా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

సర్వజన ఆస్పత్రిలో న్యూరోసర్జరీ సేవలు

- ఓపీ విభాగాన్ని ప్రారంభించిన సూపరింటెండెంట్ అనిలా సునందని



న్యూరోసర్జరీ ఓపీ విభాగాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ అనిలాసునందని

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో న్యూరోసర్జరీ, న్యూరోమెడిసిన్ ఓపీ విభాగాలను ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిలాసునందని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యూరోసర్జరీ, న్యూరో మెడిసిన్ సేవల కోసం ఇప్పటి వరకు కేజీహెచ్‌కు వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఇక నుంచి సర్వజన ఆస్పత్రిలోనే సేవలు అందుతాయని తెలిపారు. నరాల సంబంధిత రోగులు రోజురోజుకు పెరుగుతున్నారని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పీఏ రమణి, ఆర్ఎంఓ డాక్టర్ ఎన్.సురేష్‌బాబు, న్యూరోసర్జర్ డాక్టర్ రెడ్డి శంకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో ప్రొవిజినల్ మెరిట్ జాబితా

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్యకళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లో మూడు కేటగిరీల్లో ఖాళీల భర్తీకి సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్ జాబితాను విజయనగరం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ ప్రోగ్రామర్, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్, నెటవర్క్ అడ్మినిస్ట్రేటర్ పోస్టుల ప్రొవిజనల్ మెరిట్ జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. వీటిపై అభ్యంతరాలుంటే 19వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా గాజులరేగ సమీపంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో అందజేయాలన్నారు.